





ఫాల్గుణి మేళా.. నిషాన్ యాత్ర

జై శ్రీకృష్ణ..



కాచిగూడ: కలియుగ కృష్ణుడిగా భావించే శ్యామ్‌బాబా తన శిరస్సు దానమిచ్చే రోజును ఫాల్గుణి మేళాగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నుంచి ప్రారంభమైన నిషాన్ శోభాయాత్రలు సోమవారం తెల్లవారుజామున కాచిగూడలోని శ్యామ్ మందిర్‌కు చేరుకున్నాయి. దీంతో కాచిగూడ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. కుటుంబ సమేతంగా భక్తులు శ్రీకృష్ణుడు, శ్యామ్‌బాబు జెండాలను పట్టుకుని శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. ఆధ్యాత్మిక సంగీత విభావరి బృందాలు పాటలు ఆలపిస్తుండగా భక్తులు తన్మయత్వంతో నృత్యాలు చేశారు. సంప్రదాయ దుస్తుల్లో భక్తులు రంగులు చల్లుకుంటూ ఆనంద డోలికల్లో మునిగితేలారు.

శ్యామ్‌బాబా నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు..

కొందరు భక్తులు పొర్లుదండాలు పెడుతూ తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. శ్రీకృష్ణుడి చిత్రపటాలు, విగ్రహాలను రథాలలో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్యామ్‌బాబా నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ప్రధాన చౌరస్తాల వద్ద స్వాగత వేదికలను ఏర్పాటు చేసి



నిషాన్ యాత్రలకు స్వాగతం పలికారు. వేడుకల సందర్భంగా 56 రకాల మిఠాయిలతో శ్యామ్‌బాబాకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా యాత్రలపై పూల వర్షం కురిపించారు. ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఎస్సై సుభాష్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్,

జై శ్రీశ్యామ్



శ్యామ్ మందిర్ సేవా సమితి ప్రతినిధులు ఇంద్రకుమార్ అగర్వాల్, రామ్‌దేవ్ అగర్వాల్, చంద్రకాంత్, సురేష్, రాజ్‌కుమార్ విగ్, బీఆర్‌ఎస్ నేతలు ధాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బీజేపీ నేతలు భీమ్‌రాజ్, సుభాష్ పటేల్, సంతోష్, కృష్ణ, ఎస్.రవియాదవ్ తదితరులు శ్యామ్‌బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై శ్యామ్‌బాబాను దర్శించుకున్నారు.

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ మృతి తీరని లోటు

నల్లకుంట: ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు అన్నమయ్య కీర్తనలకు స్వరకల్పన చేసిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్(76) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతిని తెలియజేశారు. టీటీడీ ఆస్థాన గాయకుడిగా, సంకీర్తన యజ్ఞ ప్రక్రియకు ఆద్యుడై వెయ్యికి పైగా అన్నమయ్య కీర్తనలకు స్వరకల్పన చేశారన్నారు. అన్నమయ్య అంశగా గరిమెళ్ల జన్మించారని సంగీతాభిమానులు అంటారన్నారు. అలాంటి గొప్ప సంగీత విద్వాంసుడికి పద్మశ్రీ ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పరామర్శ



కె.శ్రీనివాస్ కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: జవహర్‌నగర్ ఉల్లిగడ్డ బస్తీవాసి కె.శ్రీనివాస్ కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని సోమవారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కలిసి అతడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్‌ముదిరాజ్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఆనంద్‌రావు, లక్ష్మీనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రికి నివాళి



చిక్కడపల్లి: తెలుగు సాహిత్యంలో పేరున్న కవులలో ప్రముఖుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి అని టీపీహెచ్‌సీ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాహిత్యవేత్త మధునాపంతులు సత్యనారాయణశాస్త్రి సంస్మరణ సభ జరిగింది. కొల్లేటి దామోదర్‌గుప్తా మాట్లాడుతూ... ఆధునిక సంప్రదాయ పద్యకవులలో మధునా పంతుల సత్యనారాయణశాస్త్రి ఒకరని అన్నారు. ఆయన రచించిన ఆంధ్ర పురాణం కావ్యంలో విశ్వనాథ వారి కవితా ధార, కరుణశ్రీ వంటి కవుల శైలి కనిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర్‌రావు, గాయని గరిమెళ్ళ సీత, కళా వీఎస్ జనార్దనామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల్లో నమ్మకం పెంచాలి



ముషీరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందే వైద్య సేవలపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా ఆశావర్కర్లు కృషి చేయాలని జిల్లా వైద్యశాఖ అధికారి డా. వెంకటి సూచించారు. సోమవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో వైద్య సేవలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలన్నారు. ఆస్పత్రిలో ఓపీ సేవలను పెంచాలని సూచించారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీకి త్వరలో కొత్త డాక్టర్‌ను నియమిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి, ఎస్‌పీహెచ్‌వోలు డా. శ్రీకాంత్, డా. సాయిబాబా, పీహెచ్‌ఎల్ స్పెల్లీస్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని యూరో నర్సరీ స్కూల్ కరస్పాండెంట్ థామస్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్తేర్ విద్యావతి, ఉపాధ్యాయులు మణి, సరిత, ఇమ్రానా, లక్ష్మి, కళ్యాణి, సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు లేని లోకాన్ని ఊహించలేం



చిక్కడపల్లి: మహిళలు లేని లోకాన్ని ఊహించలేమని వక్తలు పేర్కొన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నవరత్న మహిళా పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన మహిళలు బెజవాడ భువనేశ్వరి, శైలజామిత్ర, పాలపర్తి సంధ్యారాణి, పింగళి చంద్రిక, గిరిజ, రేవల్లి, సుధామయి, యం.లలితారాజ్, అర్చన గుత్తి, మృదుల కడియాలకు దక్షిణ మధ్య రైల్వే పూర్వ జీఎం సి.రామకృష్ణ గౌరవ అతిథిగా పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత వర్ధమాన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, లంకా లక్ష్మీనారాయణ, పులివర్తి కృష్ణమూర్తి, రామరాజు, లక్ష్మీశ్రీనివాస్, నిర్మలాప్రభాకర్, జయంతిరెడ్డి, జి.వెంకటరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలి



టీహెచ్‌సీ ఎండీకి సమస్యలు తెలుపుతున్న అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతంకు సోమవారం అహ్మద్‌గూడ డబుల్‌బెడ్‌రూం కమిటీ అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల క్రితం కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సరైన వసతులు లేవన్నారు. అందువల్ల అక్కడ నివాసించేందుకు ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. 9వ అంతస్తుపైన ఫ్లోరింగ్‌పై కప్పు పెచ్చులు ఊడిపోతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా వాటర్ లీకేజీ అవుతోందని వినతి పత్రంలో తెలిపారు. మినరల్‌వాటర్ వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం జరిగే ఆస్కారం ఉందన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వై. పరుశురాములు, ఝాన్సీ, సుధీర్, విష్ణు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఇందిరానగర్ సమస్యలను పరిష్కరించాలి



జెడ్‌సీ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దిశా కమిటీ సభ్యులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో అసంపూర్తిగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని దిశా కమిటీ హైదరాబాద్ జిల్లా సభ్యులు నందగిరి నర్సింహ అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ జెడ్‌సీ రవికిరణ్‌ను కలిసి ఇందిరానగర్ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ.. పదేళ్లుగా కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని అన్నారు. వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. స్థానికంగా 9 వీధుల్లో రోడ్లు అధ్వానంగా మారాయని వాటిని ఆధునీకరించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు కమ్యూనిటీ హాల్ ఆవరణలో ప్రత్యేక గదిని నిర్మించాలని కోరారు. స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు చంద్రమోహన్, డీఈ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

చేనేత మగ్గాన్ని అవమానించిన సీఎం క్షమాపణ చెప్పాలి



అశోక్‌నగర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న డా.చిక్కా దేవదాసు, బొమ్మ నరేందర్

చిక్కడపల్లి: చేనేత మగ్గాన్ని అవమాన పరచిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు డిమాండ్ చేశారు. సోమవారం అశోక్‌నగర్ చౌరస్తాలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి ఆయన గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్‌తో ఆయన కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిక్కాదేవదాసు మాట్లాడుతూ.. మార్చి 9న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి చేనేత మగ్గం నేసిన తీరును విమర్శించారు. యావత్ పద్మశాలీలు ముక్త కంఠంతో సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ఆత్మగౌరవ పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ పద్మశాలి నాయకులు మార్గం అమర్, చంతకింది వంశీ, బల్లా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు స్ఫూర్తి మిలియన్ మార్చ్



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి నేతలు

అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమానికి మిలియన్ మార్చ్ ఊపిరి పోసిందని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జీ.రూబీ స్టీవెన్సన్ అన్నారు. సోమవారం మిలియన్ మార్చ్ నిర్వహించి 14 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో సంక్షేమ సమితి ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూబీ స్టీవెన్సన్ మాట్లాడుతూ.. నాడు తెలంగాణ ఉద్యమాన్ని అణిచి వేస్తున్న సందర్భంలో మిలియన్ మార్చ్ విజయవంతంగా నిర్వహించి ఉద్యమ సత్తాచాటామని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్‌పై చేసిన మిలియన్ మార్చ్ నేటికీ ఉద్యమాలకు స్ఫూర్తిని ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి వెంకన్న, నాయకులు, రామగిరి ప్రకాశ్, బండి రమేశ్, ఉక్కు సుధాకర్, ఆశోక్, వాసు, శ్రీనివాస్, పాండు పాల్గొన్నారు.

నేడు ఆరెకటికల ఆత్మీయ సమ్మేళనం

కాచిగూడ: తెలంగాణ ఆరే కటిక సంఘం నేత చెకోలేకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆరెకటికల ఆత్మీయ సమ్మేళనానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ఆరెకటిక సేవా సమితి అధ్యక్షుడు కళ్యాణ్‌కార్ ఈశ్వర్ చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటలకు రవీంద్రభారతిలో జరిగే ఆరెకటికల ఆత్మీయ సమ్మేళనంలో ఆరెకటికలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దాసోజు శ్రావణ్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



ముషీరాబాద్: బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన దాసోజు శ్రావణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్,గాంధీనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులున్నారు.

మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా బొమ్మిడి శ్రవణ్‌కుమార్



నల్లకుంట: మాతా వాకర్స్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా బొమ్మిడి శ్రవణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం నల్లకుంట శంకరమఠం ఎదురుగా ఉన్న ఓ హోటల్‌పై అంతస్తులోని హాల్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగ ప్రకాష్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామానందం, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు నాగభూషణం, ప్రతినిధులు మురళీకృష్ణ, శైలజ, మోహన్, కేశవరావు దేశ్‌పాండే, కేశవ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కవాడిగూడ: కల్యాణలక్ష్మి పథకం ద్వారా లక్షలాది మంది కుటుంబాలలో ఆనందాలు నిండాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ ఎంఆర్‌వో కార్యాలయంలో 97 షాదీముబారక్, 44 కల్యాణలక్ష్మి మెత్తం 141 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సదరు చెక్కులను ఎమ్మెల్యే ముఠాగోపాల్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌తో కలిసి చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నిజమైన అర్హులను గుర్తించడంలో రెవెన్యూ అధికారులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కల్యాణలక్ష్మి పేదలకు వరంలాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, నాయకులు నర్సింగరావు, భాస్కర్, శ్యామ్‌యాదవ్, శివముదిరాజ్, ముఠా నరేష్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగుకలకు ఉపకరణులు అందిస్తున్న దృశ్యం

అంబర్‌పేట: అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆలింకో సంస్థలు సీఎస్‌ఆర్‌లో భాగంగా సోమవారం ఎన్‌పీఆర్‌డీ ఇండియా ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణలు అందించారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేశామరు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు భిక్షపతియాదవ్, నర్సింగ్, బాబురావు, ప్రవీన్, సరితబాయి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించండి



కాచిగూడ: పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారంలో వాటా కల్పించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. పద్మశాలీలకు ఒక రాజ్యసభతో పాటు రెండు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్లకు చైర్మన్ పదవులు ఇవ్వాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని అన్నారు. పద్మశాలీ మహాసభల్లో పాల్గొని పద్మశాలి, చేనేత వర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి వరాలు కురిపించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పద్మశాలీలు అందరూ రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళీ, జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం



అంబర్‌పేట పూలే చౌరస్తాలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: దేశంలో మహిళల హక్కులు, అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన తొలి మహిళ సావిత్రిబాయి పూలే అని సెంట్రల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జీ.ఆనంద్‌గౌడ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట మహాత్మా జ్యోతిరావుపూలే చౌరస్తాలో సావిత్రబాయి పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళ చైతన్యానికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ వినోద్‌యాదవ్, కృష్ణ గౌడ్, అచ్చిని నాగేశ్, నాగభూషణం చారి, వెంకటస్వామి, యశ్వంత్, నరేశ్‌గౌడ్, రాజేశ్‌నేత, మహిలారం రాజు, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ గుండు వద్ద..

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు వద్ద సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, ఓంప్రకాష్, జగదీష్, వంశీ, ఎంసీ మోహన్, కిషోర్, కౌండిన్య ప్రసాద్, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సామాజిక స్ఫూర్తిని కొనసాగిస్తాం..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే సామాజిక స్ఫూర్తిని కొనసాగిస్తామని టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సావిత్రిబాయి పూలే వర్ధంతి, జయంతి సభలను అధికారికంగా నిర్వహించాలన్నారు. టీపీఎస్‌కే గౌరవ అధ్యక్షుడు జి.రాములు మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి నేటికీ 29 ఏళ్లయినా అది అమలు కాకపోవడం బాధాకరమని అన్నారు. అమెరికాలో 40శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే భారత దేశంలో 17శాతం మాత్రమే పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అసమానతలకు కారణం ప్రభుత్వ విధానాలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే ప్రతినిధులు జి.నరేష్, రాజయ్య, ఎస్.శంకర్, శారదా, సాత్విక తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ గుండు వద్ద నివాళులర్పిస్తున్న అడిక్‌మెట్ బీజేపీ నాయకులు



సావిత్రిబాయి పూలే వర్ధంతి సభలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు